సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం : 19 : జూలై : 2024



సోమశిలలో 9.815 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 9.815 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 20 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.76,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,869
3శాతం జీఎస్టీతో	రూ.7,075
నవర (8గ్రా)	రూ.56,600

గరిష్టం/కనిష్టం
35.0 /28.0

వాతావరణం

గాలిలో తేమ 58 శాతంగా గురువారం నమోదైంది. శుక్రవారం జిల్లాలో అక్కడక్కడా ఆకాశం మేఘావృతమై, చిరుజల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు



మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో ఎముకలు, కీళ్ల విభాగానికి సంబంధించి ఖరీదైన జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తున్నామని పేషెంట్లు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం ఆస్పత్రిలో తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో నాణ్యమైన వైద్యం ఆర్థోపెడిక్ విభాగంలో అందుతుందన్నారు. 12 హిప్(తుంటి) జాయింట్ రీప్లేస్ మెంట్ ఆపరేషన్‌లు, 8 నీ(మోకాలు కీలు) జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జరీలు చేశామన్నారు. రూ.2 లక్షల ఖరీదైన హిప్(తుంటి) జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జరీలను ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చులేకుండా చేస్తున్నామన్నారు. నీ(మోకీలు) ఆపరేషన్‌లు ఆరోగ్యశ్రీ పరిధిలో లేవన్నారు. అందువల్ల నీ సర్జరీలకు అవసరమైన ఇంప్లాంట్స్ వరకు పేషెంట్లు తెచ్చుకోవాల్సి ఉందన్నారు. మిగతా ఆపరేషన్, మందులు, బెడ్స్, ఆహారం తదితర సేవలన్నీ ఉచితంగా లభిస్తాయన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న శారదాకుమారి

ఆత్మకూరు: ఉపాధ్యాయులు భావిభారత పౌరులైన విద్యార్థులకు సరైన శిక్షణ ఇచ్చి విద్యలో రాణించేలా బోధించాలని రాష్ట్ర విద్యా విషయక పరిశీలకురాలు కె.శారదాకుమారి అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో టీచ్ టూల్ 9 రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. ఐటీడీఏ ఏఎంఓ వై.శాంతికుమారితో కలిసి రాష్ట్ర పరిశీలకురాలు శారదాకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు సరళీకరణ బోధనలో నైపుణ్యాలను పెంపొందించుకొని విద్యార్థులకు విద్యా బోధన చేస్తారన్నారు. డివిజన్ స్థాయిలోని పాఠశాలల టీచర్లకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్, ఎంఈఓలు ఎం. జ్యోతి, కె.చలపతి, మాస్టర్ ట్రెయినీలు ఎ.సురేష్, డి.నాగేశ్వరరావు, కేశవ నారాయణ, డీఆర్‌పీలు, డివిజన్ స్థాయి హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ధ్వంసం

- టీడీపీ నేతల నిర్వాకంగా అనుమానం



వైఎస్సార్‌సీపీ జెండా పోల్ విరగ్గొటి పక్కన పడేసిన దృశ్యం

ఆత్మకూరు: అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే కూటమి ప్రభుత్వ అండ చూసుకొని స్థానిక టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలను, దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు వెంకట్రావుపల్లి మెయిన్ రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జెండా పోల్‌ను (ఇనుము) విరగ్గొట్టి గుట్టుచప్పుడు కాకుండా అక్కడ పడేసి వెళ్లారు. ఇది టీడీపీ నేతల పనేనని స్థానికులు అంటున్నారు. గురువారం ఉదయం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆంద్రా వెంకట సుబ్బారెడ్డి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, అనంతరం కలిసికట్టుగా ఉండాలన్నది కూటమి నేతలు మరిచిపోయారని సుబ్బారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు విచారించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దర్గా వద్ద భక్తులు



స్వర్ణాల ఘాట్ వద్ద జనసందోహం



తరలివచ్చి.. తరించి..



- రొట్టెల పండగకు పోటెత్తిన భక్తులు
- దారులన్నీ దర్గా వైపే..
- నేత్రపర్వంగా గంధమహోత్సవం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణం జనంతో కిటకిటలాడింది. దేశ, విదేశాల నుంచి జనం కోర్కెల రొట్టెల కోసం స్వర్ణాల తీరానికి చేరుకున్నారు. ఈ పండగలో అత్యంత ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవం సుగంధ పరిమళాలు వెదజల్లింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కోటమిట్టలోని మసీదులో సంప్రదాయాన్ని అనుసరించి కడప పెద్ద దర్గా పీఠాధిపతి నేతృత్వంలో బిందెల్లో గంధాన్ని కలిపారు. దానిని ప్రత్యేక రథంపై ఊరేగింపుగా మేళతాళాలు, ఫకీరుల విన్యాసాల మధ్య బారాషహీద్ దర్గాకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనల అనంతరం గంధాన్ని షహీదుల సమాధులకు లేపనం చేశారు. అనంతరం భక్తులకు పంచిపెట్టారు. కాగా గురువారం రొట్టెల పండగ అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వర్ణాల చెరువులో స్నానమాచరించి కోర్కెల రొట్టెలను స్వీకరించారు.

వైభవంగా గంధమహోత్సవం

బారాషహీద్ దర్గాలో జరిగిన గంధమహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రొట్టెల పండగలో ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవానికి ముందస్తు ఏర్పాట్లు చేశారు. తొలుత కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన ప్రత్యేక గంధాన్ని కోటమిట్టలోని అమీనియా మసీదు వద్దకు చేర్చారు. ఖలీఫాలు, సూఫీ, మత గురువులు తదితరులు అక్కడికి చేరుకుని సిద్ధం చేసిన ప్రత్యేక బిందెల్లో గంధాన్ని నింపారు. సుగంధ ద్రవ్యాలను అందులో కలిపారు. ప్రార్థనల అనంతరం గంధాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచగా బాణసంచా, భక్తీ గీతాలాపనల నడుమ వాహనం ముందుకు సాగింది. ఫకీర్ల అబ్బుర పరిచే విన్యాసాలతో గంధపు బిందెలతో దర్గాకు చేర్చి కడప పెద్ద దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేనీ ప్రత్యేక ప్రార్థనలు అనంతరం షహీద్‌ల సమాధులకు లేపనం చేశారు.

జనసంద్రంగా స్వర్ణాల చెరువు

దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువు జనసంద్రంగా మారింది. రెండోరోజు భక్తుల తాకిడి కొనసాగడంతో దర్గా ప్రాంతం జనసంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులే కాదు, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఇంటిల్లిపాది వచ్చి స్వర్ణాల చెరువు ప్రాంగణంలో సందడి చేయడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. మది నిండా ఎన్నో కోర్కెలతో భక్తులు ఈ ఏడాదైనా తమ కోర్కెలు తీరుతాయని భక్తితో వచ్చి రొట్టెలు పట్టుకుంటున్నారు.

కిటకిటలాడిన ఏఎస్‌పేట, కసుమూరు దర్గాలు

రొట్టెల పండగకు వచ్చే భక్తులు జిల్లాలోని అనుమసముద్రంపేట, కసుమూరు దర్గాలను దర్శించుకుంటున్నారు. ఆయా దర్గాల్లో కూడా భక్తజనం పోటెత్తడంతో కిటకిటలాడుతున్నాయి. ఆయా దర్గాలను సందర్శించి భక్త శ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్నారు.

పోటెత్తారు

రొట్టెల పండగకు రెండోరోజు భక్తులు భారీగా తరలివచ్చారు. నగరంలోని దారులన్నీ దర్గా వైపే అన్నట్లుగా భక్తజనులు పోటెత్తారు. తీరిన కోర్కెలతో రొట్టెలు వదలగా.. కోర్కెలతో వచ్చిన భక్తులు రొట్టెలు పట్టుకున్నారు. అనంతరం బారాషహీద్‌లను భక్తితో దర్శించుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకొని తరలి వెళ్తున్నారు. రొట్టెల పండగలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పర్యవేక్షణ చేస్తున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



నెల్లూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు తదితరులు

నెల్లూరు (లీగల్): వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ దేశంలో ద్విచక్ర వాహనాలను నడిపే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న ఫలితంగా మరణాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. మన భద్రత కోసం , మనపై ఆధారపడి ఉన్న వారి కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు కబర్ది, తేజోవతి, శ్రీనివాసరావు, సరస్వతి, గీత, సుమలత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కరుణా కుమార్, నగర మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తులు శారదా రెడ్డి, అఖిల, లావణ్య, దేవిక, వినోద్ కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత హేయంగా శాంతిభద్రతలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు సిటీ: రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అత్యంత హేయంగా శాంతిభద్రతల పరిస్థితి ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ దారుణహత్యకు గురికావడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగుదేశానికి చెందిన జిలానీ అత్యంత దారుణంగా నడిరోడ్డుపై హత్య చేయడం చూస్తుంటే ప్రజలు బయట తిరగాలంటేనే భయపడే విధంగా సంఘటన ఉందన్నారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు జరగడం, పోలీసు వ్యవస్థ చూస్తూ ఉండిపోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాంటివి జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వీఎస్‌యూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా విజయభాస్కర్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా సారంగం విజయభాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీఎస్‌యూ వైస్ చాన్సలర్‌గా ఉన్న సుందరవల్లి రాజకీయ ఒత్తిళ్ల కారణంగా గత నెల 28న రాజీనామా చేసి ఆ లేఖను గవర్నర్‌కు పంపారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న సారంగం విజయభాస్కర్‌ను వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..



నెల్లూరు(క్రైమ్): ఒంటరి మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి లోబర్చుకుని నగదు దోచేశాడు. అనంతరం మొహం చాటేసిన ఘటనలో నిందితునిపై గురువారం బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని శ్రీహరినగర్‌కు చెందిన ఓ మహిళకు సునీల్‌బాబు అనే వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో మూడేళ్లకే భర్త నుంచి విడిపోయి ఆమె తన కుమారుడితో కలిసి ఒంటరిగా జీవిస్తోంది. ఈ నేపథ్యంలో 2014లో ఆమెకు వెంకటాచలం మండలం కంటేపల్లికి చెందిన మనోజ్‌కుమార్‌తో పరిచయమైంది. తనకు వివాహం కాలేదని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకున్నాడు. ఆమె వద్ద నుంచి పలు దఫాలుగా రూ.17 లక్షల నగదును తీసుకున్నాడు. వివాహం చేసుకోమని సదరు మహిళ అతడిని నిలదీయగా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. అతని గురించి ఆరాతీయగా మనోజ్‌కుమార్‌కు ఇది వరకే వివాహమైనట్లు తెలిసింది. ఇదేంటని బాధితురాలు నిలదీయగా కులం పేరుతో దూషించడంతోపాటు, చంపుతామని బెదిరించసాగాడు. ఈ మేరకు బాధిత మహిళ బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే విద్యార్థుల మొగ్గు



- ముగిసిన ఏపీ ఈఏపీ సెట్ తొలి విడత కౌన్సెలింగ్
- జిల్లాలో మొత్తం 14 ఇంజినీరింగ్ కళాశాలలు
- తొలివిడతలో 77 శాతం సీట్లు భర్తీ
- గతేడాది కంటే పెరిగిన 883 సీట్లు

నెల్లూరు (టౌన్): ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల ఆశలు చిగురించాయి. ఎక్కువ మంది విద్యార్థులు ఇంజినీరింగ్ బాట పడుతుండడంతో కళాశాలల్లో ఆశించిన స్థాయిలో సీట్లు పెరిగాయి. ఈ విద్యా సంవత్సరంలో తొలి విడత కౌన్సెలింగ్‌లో 77 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. అయితే ఈ ఏడాది ఇంజినీరింగ్‌లో విద్యార్థులు కంప్యూటర్ సైన్స్‌కే జై కొట్టారు. జిల్లాలో ప్రస్తుతం 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహించారు. మరో 3 కళాశాలల్లో సరైన వసతులు, ఫ్యాకల్టీ లేదన్న కారణంతో ఉన్నత విద్యామండలి ఈ ఏడాది ప్రవేశాలను నిలిపివేసింది. పదేళ్ల క్రితం జిల్లాలో 26 ఇంజినీరింగ్ కళాశాలలో ఉండేవి. అయితే ఆయా కళాశాలల్లో ప్రవేశాలు ఆశించిన స్థాయిలో లేక పోవడంతో ఒక్కొక్క కళాశాలను మూసివేస్తున్న పరిస్థితి ఉంది. ఈ ఏడాది ఆయా ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు గత ఏడాది కంటే అదనంగా 883 సీట్లను పెంచుకున్నాయి. జిల్లాలోని 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో తొలి విడతలో ఆయా బ్రాంచ్‌ల్లో కలిపి 8,722 సీట్లు ఉంటే 6,789 సీట్లు భర్తీ అయ్యాయి. అంటే 77 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో 98.24 శాతం, గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో 97.16 శాతం, గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో 96.88 శాతం, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 77.57 శాతం, ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో 60.53 శాతం, కావలిలోని విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో 88.78 శాతం, ఏఈసీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 81.02 శాతం, ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 94.79 శాతం, ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 88.95 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. అదే విధంగా పీఆర్‌ఐకేలో 5.13 శాతం, డీఎస్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 16.60 శాతం, డీఎస్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 50.93 శాతం, గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో 59.38 శాతం, క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో 15.87 శాతం, పీబీఎస్ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 35.42 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

పెరిగిన ఫీజు

ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. గత ఏడాదిలో రూ.40 వేలు ఉండగా ఈ విద్యా సంవత్సరంలో రూ.43 వేలకు పెంచింది. అదే విధంగా కళాశాల స్థాయిని బట్టి రూ.1.05 లక్షలు వరకు ఫీజును నిర్ణయించారు. ఏపీ ఈఏపీ సెట్‌లో విద్యార్థులకు వచ్చిన ర్యాంకు ఆధారంగా ఆయా కళాశాలల్లో సీట్లు కేటాయించనున్నారు. అదే విధంగా ఏపీ ఈఏపీ రెండో, మూడో విడత కౌన్సెలింగ్‌ను కూడా నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్‌లు పూర్తయ్యే నాటికి ఇప్పుడున్న కళాశాలల్లో సీట్ల భర్తీల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది.

సీట్ల భర్తీ ఇలా..

ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ఈఈఈ, సీఎస్‌సీ, సీఎస్ఎం, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ తదితర కోర్సులున్నాయి. అయితే ఈ విద్యా సంవత్సరం ఇంజినీరింగ్‌లో కంప్యూటర్స్ సైన్స్‌కు విద్యార్థులు మొగ్గు చూపారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో కలిపి కంప్యూటర్స్ సైన్స్‌కు సంబంధించి 3,357 సీట్లు ఉండగా వాటిల్లో 3,059 సీట్లు భర్తీ అయ్యాయి. ఆ తరువాత ఏఐఎంఎల్ 720 సీట్లుకు 661 సీట్లు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్‌కు సంబంధించి 528కు 435 సీట్లు భర్తీ అయ్యాయి. ఈసీఈలో 1,725కు 1,317 సీట్లు, ట్రిబుల్ ఈకు 549కు 253 సీట్లు, మెకానికల్ విభాగంలో 360కు 118 సీట్లు భర్తీ అయ్యాయి. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఇతర కోర్సులు తగ్గించుకుని కంప్యూటర్స్ సైన్స్ విభాగంలో తమ సీట్లు పెంచుకున్నట్లు తెలిసింది.

ఏ బ్రాంచ్‌లోనైనా ఉద్యోగావకాశాలు

కంప్యూటర్ సైన్స్ చదివితేనే ఉద్యోగం వస్తుందన్న భావన విద్యార్థుల్లో నెలకొంది. ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ బ్రాంచ్‌ల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంజినీరింగ్ విద్యను డిగ్రీ కోసం కాకుండా స్కిల్స్ అభివృద్ధి చేసుకునేందుకు చదవాలి. కోర్ బ్రాంచీల్లో నైపుణ్యం గల ఇంజినీర్ల కొరత బాగా ఉంది. కోర్ బ్రాంచ్‌లను కూడా తీసుకుంటే భవిష్యత్‌లో మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ఇంజినీరింగ్‌లో కొత్త కోర్సులు వచ్చాయి. స్పెషలైజేషన్‌పై పట్టు సాధిస్తే ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలరు.

– యర్రగుంట్ల దినకర్, ప్లేస్‌మెంట్ అధికారి

రెవెన్యూలో కలగానే పదోన్నతులు

నెల్లూరు(దర్గామిట్ట): రెవెన్యూ శాఖలో అర్హులైన వారికి పదోన్నతులు కలగానే మిగిలిపోనున్నాయి. గతంలో శిక్షణ ఇచ్చినా, పరీక్షలు నిర్వహించకపోవడంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సర్వీసులో సీనియారిటీ కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురయ్యే ప్రమాదముందని వాపోతున్నారు. రెవెన్యూలో పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులు, ఐదేళ్లు పూర్తి చేసిన జూనియర్ సహాయకులు, సచివాలయం (సెక్రటేరియట్)లో పనిచేసే ఏఎస్‌ఓలు కలిపి రాష్ట్రంలో 677 మందికి పదోన్నతి కల్పించేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో వీరు 55 మంది వరకు ఉన్నారు. దీని కోసం వీరందరికీ 2023 ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు నెల రోజుల పాటు ఏపీ సర్వే అకాడమీ సామర్లకోట ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించింది. మరో 12 రోజుల పాటు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఇక థియరీ పరీక్ష నిర్వహించాల్సి రావడంతో ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. ఫలితంగా అర్హులైన వారందరూ పదోన్నతి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం తమకు పరీక్షలు నిర్వహించి పదోన్నతులు కల్పించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.


రొట్టెను స్వీకరిస్తూ..


రొట్టెలు తీసుకున్న సంతోషంలో..


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


షాపింగ్‌లో బిజీబిజీ..


స్వర్ణాల చెరువులో జలకాలాట


స్వర్ణాల ఘాట్ వద్ద జనం

స్వర్ణాల తీరం జనసంద్రం

స్వర్ణాల తీరం జనసంద్రమైంది. గురువారం భక్తులు పోటెత్తారు. కులమతాలకు అతీతంగా దేశం నలుమూలల నుంచి నెల్లూరులోని బారాషహీద్ దర్గాకు తరలివచ్చారు. వేల కుటుంబాలు దర్గా ప్రాంగణంలో సందడి చేశాయి. అనేకమంది భక్తిభావంతో కోర్కెల రొట్టెలను స్వీకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్


ఉద్యోగ రొట్టెను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు


దర్గాలో దర్శించుకుంటూ..

భక్తిభావంతో..








అపురూప క్షణాలను ఫోన్‌లో బంధిస్తూ..

క్లుప్తంగా

డ్రగ్స్ కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

కోవూరు: శాంపిల్ డ్రగ్స్‌ను అక్రమంగా నిల్వ ఉంచాడన్న కేసులో నేరం రుజువు కావడంతో జెట్టి సునీల్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి కోవూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.కాత్యాయని మూడేళ్ల జైలు శిక్ష, రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కోవూరు పీఎస్ఆర్ కాలనీలో సునీల్‌కుమార్‌రెడ్డి ఇంటిని అద్దెకు తీసుకుని ఉండేవాడు. అతను 2012లో ఎలాంటి అనుమతి లేకుండా శాంపిల్ డ్రగ్స్ నిల్వ చేశాడని అప్పటి కావలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరామమూర్తికి సమాచారం అందడంతో వెళ్లి దాడులు చేశారు. డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని సునీల్‌కుమార్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

గేదెల ఉసురు తీసిన విద్యుత్ తీగ



కొండాపురం: మండలంలోని తూర్పుయర్రబల్లి గ్రామ పొలాల్లో 11 కేవీ విద్యుత్ లైన్ తెగిపోయింది. మాలకొండయ్య అనే రైతు గురువారం తన రెండు గేదెల్ని మేత కోసం పొలాలకు తోలాడు. వాటికి తెగిన విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాయి. రెండు గేదెల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని మాలకొండయ్య తెలిపాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

కేజీ వెండి, రూ.65 వేల నగదు చోరీ

మర్రిపాడు: మండలంలోని కండ్రిక గ్రామంలో బుధవారం రాత్రి ఓ ఇంట్లో కిలో వెండి, రూ.65 వేల నగదు చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మేకల శేషయ్య దంపతులు ఇంట్లో నిద్రపోతున్నారు. ఈ సమయంలో దొంగలు ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోనికి ప్రవేశించి శేషయ్య దిండు కింద ఉన్న తాళాలను తీసుకుని బీరువా తెరిచి వెండి, నగదును అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది.

భద్రత కట్టుదిట్టం


తప్పిపోయిన చిన్నారులను సంరక్షించిన పోలీస్ అధికారులు


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- భక్తుల సేవలో పోలీసులు
- 140 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగింత

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసింది. దర్గా ఆవరణలో రద్దీ దృష్ట్యా తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన 140 మంది చిన్నారులను పోలీసులు సంరక్షించి బాధిత తల్లిదండ్రులకు అప్పగించారు. క్రైమ్ పోలీసులు నేరాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేశారు. గురువారం భక్తులు మూడు బ్యాగ్‌లు పోగొట్టుకోగా గుర్తించి అందజేశారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డాగ్, బాంబ్ స్క్వాడ్‌లు నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాయి. గంధ మహోత్సవం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు విధులు కొనసాగిస్తున్నారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలీసు అధికారులతో కలిసి దర్గా ఆవరణ, కమాండ్ కంట్రోల్ రూమ్, స్వర్ణాల ఘాట్ తదితరాలను పరిశీలించి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లున్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు సదస్సులు

- ఎస్ఈ విజయన్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై నేటి నుంచి అవగాహన సదస్సులు జరుగుతాయని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్య లక్ష్మి సూచనలతో, ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు ఆదేశాలతో శుక్రవారం నుంచి జిల్లా సర్కిల్ విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది సదస్సులు నిర్వహిస్తారన్నారు. పొలాల్లో వేసిన విద్యుత్ ఫెన్సింగ్, తెగి పడిన లైన్లు, నీట మునిగిన మోటార్లు, తక్కువ ఎత్తులో ఉండే లైన్లతో జరిగే ప్రమాదాలు, వాటి నివారణపై అధికారులు వివరిస్తారన్నారు. లైన్లు తెగిపడిన సమయంలో సంబంధిత విద్యుత్ శాఖకు చెందిన సిబ్బందికి లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

బతుకుదెరువు కోసం వెళ్లి..

- గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి


జాకీర్ హుస్సేన్ మృతదేహం

మదనపల్లె: బతుకుదెరువుకు వచ్చిన ఓ లారీ క్లీనర్ గుండెపోటుకు గురై మృత్యుఒడికి చేరుకున్న ఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన లారీ డ్రైవర్ బాషా, క్లీనర్ జాకీర్ హుస్సేన్ (48) టమాటో మార్కెట్‌కు వచ్చారు. అమ్మచెరువుమిట్ట సమీపంలో లారీ నిలిపి భోజనం చేసేందుకు సిద్ధమవగా జాకీర్ హుస్సేన్ గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. లారీ డ్రైవర్ బాషా హుటాహుటిన అతడిని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగ వైద్యులు పరీక్షించి హుస్సేన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తీవ్ర విషాదంతో మృతదేహాన్ని నెల్లూరుకు తరలించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35

లాయర్ పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): లాయర్ పేరిట ఓ వ్యక్తిని మోసగించి నగదు కాజేసిన ఘటనపై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఏసీ నగర్‌కు చెందిన ఎం.శ్రీనివాసరావు ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేశాడు. కంపెనీ ఆయనకు జీతం, ఇతర భత్యాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. ఈ విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు అనే వ్యక్తి తాను లాయర్‌నని అతడితో పరిచయం చేసుకున్నాడు. కంపెనీ నుంచి నగదు ఇప్పిస్తానని నమ్మించి పలు దఫాలుగా రూ.1.15లక్షల నగదు తీసుకున్నాడు. కంపెనీ నుంచి ఎంతకీ నగదు ఇప్పించకపోవడంతో బాధితుడు నాగేశ్వరరావు గురించి ఆరాతీయగా లాయర్ కాదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నకిలీ లాయర్‌పై కేసు నమోదు చేశారు.

గేదెల్ని అపహరించి తరలిస్తుండగా..

- ఇద్దరు వ్యక్తులను పట్టుకున్న గ్రామస్తులు


గ్రామస్తుల అదుపులో నిందితులు

మర్రిపాడు: గేదెల్ని అపహరించి ట్రక్కు ఆటోలో తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న ఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు మర్రిపాడు మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల నుంచి గేదెలను అపహరించి తరలిస్తున్నారు. దీంతో ప్రజలు వారిని పట్టుకునేందుకు బుధవారం రాత్రి రెక్కీ నిర్వహించారు. బద్వేల్, మైదుకూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు బుధవాడ వద్ద ఓ గేదెను ట్రక్కు ఆటోలోకి ఎక్కించారు. ఉమ్మాయపల్లి వద్ద మరో గేదెను ఎక్కిస్తున్న క్రమంలో గ్రామస్తులు చూశారు. దీంతో ముగ్గురిలో ఒక వ్యక్తి పరారయ్యాడు. నిందితులను పోలీసులకు అప్పగించారు. వారు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 132
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 238
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 187

వామ్మో గుంత.. ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శివన్నారాయణ

సంగం: ఓ వ్యక్తి స్కూటీపై ఇంటికి వెళ్తున్నాడు. ఇంతలో నడిరోడ్డుపై గుంత అతడిని తీవ్ర గాయాలపాలు చేసింది. ఈ ఘటన మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. శివన్నారాయణ అనే వ్యక్తిది ఆత్మకూరు. ఇతను స్కూటీపై నెల్లూరు నుంచి సొంతూరికి బయలుదేరాడు. ఈ సమయంలో సంగం కావలి కాలువ వద్ద రోడ్డుపై ఉన్న గుంతలో స్కూటీ పడింది. శివన్నారాయణ కింద పడి గాయాలపాలయ్యాడు. అదే సమయంలో వెనుక వస్తున్న వ్యాను అతడిని ఢీకొని కొంత దూరం ముందుకు లాక్కెళ్లింది. ఈ ఘటనతో శివన్నారాయణ తీవ్రంగా గాయపడగా ఎస్సై నాగార్జునరెడ్డి తన జీపులో ఎక్కించుకుని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- మండలంలోని సిద్ధీపురం వద్ద మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పుట్టపర్తికి చెందిన కృష్ణారెడ్డి నెల్లూరులోని ఓ పెయింట్‌షాపులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం మోటార్‌బైక్‌పై సిద్ధీపురం వచ్చాడు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.